

నేడు స్పందన రద్దు

అర్జీలను 'జగనన్న సురక్ష'లో ఇవ్వాలి

ఏలూరు : కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులందరూ జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొనడంతో ఈ నెల మూడో తేదీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న స్పందన కార్యక్రమం రద్దు చేశారు. స్పందన వినతులను మండలంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం శిబిరంలో అధికారులకు అందించాలని తెలిపారు.

నూజివీడు రూరల్: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల మూడో తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సబ్ కలెక్టర్ అదర్ష్ రాజేంద్రన్ ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలంటే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఇవ్వవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని డివిజన్‌లోని ప్రజలు తెలుసుకొని సమస్యలు ఉంటే సురక్ష కార్యక్రమంలో అర్జీలను అందించాలని తెలిపారు.

నష్టాల సాగు..!



- భారీగా పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- భారంగా ఎరువులు, పురుగు మందుల ధరలు
- ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి
- వచ్చేది రూ.50 వేలు మాత్రమే
- కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం
- సాగుకు వెనుకాడుతున్న కౌలురైతులు
- బీడువారుతున్న వందలాది ఎకరాలు

ప్రజాశక్తి - భీమవరం

ఆరుగాలం శ్రమించే రైతన్న కష్టమంతా పెట్టుబడికే సరిపోతోంది. పెరిగిన కూలి రేట్లు, ఎరువులు, పురుగు మందుల ధరలకు రైతులు ఆర్థికంగా నలిగిపోతున్నారు. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెడుతున్న రైతన్న పంట ఆశాజనకంగా పండితే రూ.50 వేల వరకూ వస్తున్న పరిస్థితి ఉన్నప్పటికీ ప్రకృతి వైపరీత్యాలతో అది కూడా అందే పరిస్థితి కనిపించడం లేదు. కౌలురైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో సాయం అందకపోవడంతో సాగుకు నానాతంటాలు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో సార్వాసాగుకు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక రూపొందించినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో నారుమడులు పూర్తిస్థాయిలో పోయలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో గత నెల ఒకటో తేదీన కాలువలకు నీరు విడుదల చేసినప్పటికీ శివారు ప్రాంత పొలాలకు నీరు అందే పరిస్థితి లేదు. దీనికి తోడు సాగులో ఎన్నో సమస్యలు, ఇబ్బందులు వెంటాడుతుండటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటివరకూ కేవలం 40 శాతం మాత్రమే నారుమడుల ప్రక్రియ పూర్తయింది. మిగతాది మరో వారం పది రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రెండు లక్షల 46 ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో రైతులు ఈ ఏడాది సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. రెండు జిల్లాల్లో సుమారు ఏడు లక్షల మంది రైతులుండగా వీరిలో సుమారు నాలుగు లక్షల మంది వరకూ కౌలు రైతులే ఉన్నారు. నూటికి 90 శాతం కౌలు రైతులే సాగుచేస్తున్నారు. అయితే వ్యవసాయంలో కౌలు రైతులకు పూర్తిస్థాయిలో చేయూత లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతూ ఆర్థికంగా అష్ట కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా గతంతో పోల్చితే వ్యవసాయంలో అనేక మార్పులతో పాటు యాంత్రీకరణ కూడా రావడం, కూలి ధరలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చులు అమాంతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో వరిసాగులో రైతన్నల కష్టం పెట్టుబడికే సరిపోతోంది. పెట్టుబడులు పెరగడంతో పంట పండినప్పటికీ ఆదాయం కనిపించకపోవడంతో రైతులు తీవ్ర నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సార్వా సీజన్‌లో కూలి ధరలు బాగా పెరిగిపోయాయి. ఎకరాకు సరాసరి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.50 వేల వరకూ వస్తున్నప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే రైతుల చేతికి లాభం అందుతుంది. అది కూడా ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా పంట సంపూర్ణంగా చేతికందితేనే. కొన్ని పరిస్థితుల్లో చిల్లిగవ్వ కూడా రైతులకు వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కౌలురైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందడం లేదు. రైతు భరోసా, పంట నష్టపరిహారం, పంటల బీమా, రుణాలు సైతం పూర్తిస్థాయిలో అందకపోవడంతో కౌలురైతులు ఆర్థికంగా నలిగిపోవడంతో పాటు మానసికంగా కుంగిపోతున్నారు. దీంతో సాగు చేయడం కంటే పంటలు వదిలేసిన పరిస్థితులున్నాయి. జిల్లాలో నరసాపురం, యలమంచిలి, పాలకోడేరు, గణపవరం, భీమవరం రూరల్ పరిధిలోని భూములు బీడుగా వదిలేస్తున్నారు. గతేడాది సార్వాలో 20 వేల హెక్టార్లలో సాగు చేయకుండా వదిలేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అందని ప్రభుత్వ సాయం

వరిసాగులో ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సహకారం లేదని పలువురు రైతులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రభుత్వ లబ్ది భూ యజమాని అంగీకారం లేకపోవడంతో కౌలు రైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అయితే ఎక్కువ శాతం కౌలురైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి చేయూతనందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రభుత్వం అందించే లబ్ధిలో కూడా సవాలక్ష నిబంధనలు పెట్టి అసలైన సాగుదారులకు అన్యాయం చేస్తున్నారు. సాగులో ప్రధానపాత్ర పోషించే యాంత్రిక పనిముట్లకు ఉమ్మడిజిల్లాలో గత ప్రభుత్వం రూ.25 కోట్ల వరకూ బడ్జెట్ కేటాయించినప్పటికీ అది ఇప్పుడు నిలిపివేయడంతో పనిముట్లు కొనాలంటే రైతులకు భారంగా మారింది. రైతులకు యాంత్రిక పనిముట్లు సబ్సిడీ సుమారుగా రూ.30 వేలు వచ్చేవి. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సాగుకు వెనకడుగువేస్తున్నారు. భూమిని చూసైనా కొంతమేర అప్పు పుడుతుందనే ఉద్దేశంతో సాగుచేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

తగ్గుతున్న వరిసాగు

రానురాను వరిసాగు గణనీయంగా తగ్గిపోతోంది. ముఖ్యంగా కౌలురైతులు వరిసాగుకు వెనకడుగు వేస్తున్నారు. లీజు కొన్నిప్రాంతాల్లో ఒకలా ఉంటే మరికొన్ని ప్రాంతాల్లో మరోలా ఉంది. అయితే ఈ ఏడాది వరి సాగులో కౌలు రేటు పెరిగినట్లు తెలుస్తుంది. దీనికి అనేక కారణాలు కూడా ఉన్నాయి. వరిసాగు చేసేవారు లేక కొన్ని ప్రాంతాల్లో కౌలు రేటు తగ్గితే, చేలు బాగుంటే చోట్ల అధికంగా ఉంది. ఎకరాకు 12 బస్తాలు నుంచి 16 బస్తాల వరకూ లీజు ఉండేది. అదికాస్తా 10 బస్తాల్లోపు కొన్ని ప్రాంతాల్లో ఆరు బస్తాలకు పడిపోయింది. దీనికి కారణం పెట్టుబడి పెరగడంతో కౌలు రైతులు తగ్గిపోవడమేనని భూమి యజమానులు అంటున్నారు. ఎకరా ధర రూ.40 లక్షలు నుంచి రూ.కోటి ఉంటే ఏడాది మొత్తం వ్యవసాయం చేసినప్పటికీ ఆదాయం మాత్రం రూ.20 వేలు వస్తుందని రైతులు చెబుతున్నారు.

ఎకరానికి పెట్టుబడి ఖర్చులు ఇలా..

నారుమడికి రూ.1800, దమ్ముకు రూ.నాలుగు వేలు, గట్టులంకకు రూ.1400, బాగుచేతకు రూ.1400, నాట్లు వేయడానికి రూ.ఆరు వేలు, కలుపు తీతకు రూ.1800, ఎరువులు రూ.ఏడు వేలు, పురుగు మందులు రూ.6800, మాసూలు కూలి రూ.3300, పంట మాసూళ్లు రూ.7400 మొత్తం కలిపి రూ ఆయా ప్రాంతాలను బట్టి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి అవుతుంది.

పురుగుమందుల ధరలు భారీగా పెరిగాయి

కడలి ఆంజనేయులు, కౌలు రైతు, చట్టవరం



నేను 15 ఏళ్ల నుంచి కౌలుకు వ్యవసాయం చేస్తున్నాను. ప్రస్తుతం ఎకరం 50 సెంట్లు మాత్రమే సాగు చేస్తున్నాను. అప్పటికీ, ఇప్పటికీ సాగులో వ్యత్యాసం పెరగడంతో కౌలు ధర తగ్గిస్తూ వచ్చాను. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. యాంత్రీకరణ రావడం, ప్రభుత్వసాయం అంతంతమాత్రంగా ఉండటంతో మరింత భారం పెరిగింది.

కౌలు రైతులను ఆదుకోవాలి

మామిడిశెట్టి రామాంజనేయులు, కౌలు రైతు సంఘం పశ్చిమ జిల్లా కార్యదర్శి



ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ పాలకులు ఏలుతున్న కౌలు రైతుల సమస్యలు పట్టించుకున్న దాఖలాల్లేవు. సాగులో కౌలు రైతులు ఆర్థికంగా అష్ట కష్టాలు ఎదుర్కొంటున్నారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వడం లేదు. కౌలు రైతులను ప్రభుత్వం మోసం చేస్తుంది. రైతు భరోసా, పంట నష్ట పరిహారం, పంటల బీమా, బ్యాంకు రుణాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. నామమాత్రంగా అందించి చేతులు దులుపుకుంటున్నారు. కౌలు రైతులను ఆదుకోవాలి.



కృష్ణాజిల్లాలో సాగుతున్న పాదయాత్ర

ఉత్సాహభరితం.. ఉత్తేజ పూరితం

కృష్ణాజిల్లాలో సాగిన పోలవరం పోరుకేక మహాపాదయాత్ర

బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరంలో ఘనస్వాగతం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి, గన్నవరం



యాత్రలో పాల్గొన్న ఏలూరు జిల్లా నేతలు

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో 'పోలవరం పోరుకేక' మహాపాదయాత్ర ఉత్సాహంగా కొనసాగుతోంది. కృష్ణాజిల్లాలోని బాపులపాడు, ఉంగుటూరు, గన్నవరం మండలాల్లోని పర్యటించిన అన్ని గ్రామాల్లోని ఆయా గ్రామాల ప్రజానీకం, రైతులు, కూలీలు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలవర్షం కురిపించారు. కొన్నిచోట్ల మహిళలు హారతులు ఇచ్చారు. 13వ రోజు మండుటెడను, వేడిగాలులను సైతం లెక్కచేయకుండా యాత్ర బృందం ముందుకు సాగింది. 13వ రోజు ఆదివారం బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి గన్నవరం వరకూ కొనసాగింది. అల్లూరు సీతారామరాజు, ఏలూరు, కృష్ణాజిల్లాలోని 11 మండలాల్లో యాత్ర పూర్తి చేసుకుంది.

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు కృష్ణాజిల్లాలో అడుగడుగునా ఘనస్వాగతం లభిస్తోంది. బాపులపాడు మండలంలో ఆదివారం 13వ బృందం పర్యటించింది. మండుటెడను, వేడిగాలలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగింది. గ్రామ గ్రామాన పేదలు, రైతులు, కూలీలు, టిడిపి, వైసిపి నాయకులు యాత్రపై పూలవర్షం కురిపించారు. నిర్వాసితుల పోరాటానికి తమ మద్దతు ప్రకటించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలో సాగుతున్న యాత్ర బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నుంచి ఆదివారం బయలుదేరింది. వీరవల్లి ముఖద్వారం వద్దకు రాగానే తెలుగు రైతు రాష్ట్ర నాయకులు గుండపనేని ఉమావరప్రసాద్ స్వాగతం పలికి సంఘీభావం ప్రకటించారు. గ్రామంలోని సచివాలయం సెంటర్లో ఆశా వర్కర్లు, అంగన్వాడీ ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ బొమ్మ సెంటర్‌లో వైసిపి నాయకులు కృష్ణప్రసాద్, చిలకపాటి పద్మనాభరావు, ఇతర రైతు నాయకులు, గ్రామ పెద్దలు యాత్రకు పూలతో స్వాగతం పలికారు. యాత్ర బృందానికి మజ్జిగ, మంచి నీరు అందించారు. అంగన్వాడీ, ఆశా ఉద్యోగులు యాత్ర సారథి శ్రీనివాసరావును కలిసి తమ మద్దతు తెలిపారు. కోడూరుపాడు పంచాయతీలోని ఉమామహేశ్వరపురంలో యాత్రకు వ్యవసాయ కార్మికులు స్వాగతం పలికారు. శ్రీనివాసరావుకు మహిళలు వీర తిలకం దిద్దారు. యాత్ర బృందం సభ్యులకు మజ్జిగ అందజేశారు. అనంతరం పాదయాత్ర బాపులపాడు మండలం అంపాపురం మీదుగా ఉదయం 8 గంటలకు బయలుదేరిన యాత్ర మధ్యాహ్నం 12 గంటలకు తేలప్రోలుకు చేరింది. తేలప్రోలులో పార్టీ నాయకులు టి.వి.లక్ష్మణస్వామి, ఉంగుటూరు మండలకార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు, వెన్నూతల సర్పంచ్ తెల్లాకుల రామ్మోహనరావు, పార్టీ సీనియర్ నాయకులు పిల్లి రాజారావు, సలీమ్, భీమవరపు సుబ్బారెడ్డి తదితరులు స్వాగతం పలికారు. నాయకులకు పూ లమాలలు వేశారు. పొట్టిపాడులో పార్టీ నాయకులు, రైతులు స్వాగతం పలికారు. ఆత్కూరులో ఎన్టీఆర్ విగ్రహానికి సిపిఎం నాయకులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పెద్ద ఆవుటపల్లిలో ఉపాధి కూలీలు, మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. యాత్రబృంద నాయకులకు పూలమాలలు వేసి రెడ్ సెల్యూట్ చేశారు. అనంతరం చిన ఆవుటపల్లి మీదుగా పాదయాత్ర గన్నవరం చేరకుంది. పిన్నమనేని ఆసుపత్రి వద్ద గన్నవరం మండలానికి చెందిన సిపిఎం నాయకులు స్వాగతం పలికి నాయకులపై పూలవర్షం కురిపించారు. మధ్యాహ్నం తేలప్రోలు ఐటిఐ కాలేజీలో విరామం తర్వాత బయలుదేరిన యాత్ర పొట్టిపాడు, ఆత్కూరు, అవుటపల్లి మీదుగా గన్నవరం చేరుకుంది. ఆత్కూరులో తెలంగాణా సాయుధ పోరాట వీరుడు అన్నే రామారావు విగ్రహానికి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గన్నవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపిఎం గన్నవరం మండల నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. యాత్ర సారధి శ్రీనివాసరావుతో కలిసి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారామ్, సిహెచ్.బాబూరావు, వి.వెంకటేశ్వర్లు, వై.వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు వై.కేశవరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.కృష్ణయ్య, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లా కార్యదర్శులు వి.కిరణ్, ఎ.రవి, సిఐటియు నాయకులు నాగమణి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు, చౌటపల్లి రవి, కళ్ళం వెంకటేశ్వరరావు తదితరులు యాత్రలో నడిచారు.

నిర్వాసితుల ఉగ్రరూపాన్ని చూడొద్దు

సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి కిరణ్

పోలవరం నిర్వాసితులను చిన్నచూపు చూసిన పాలకులు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లిస్తారని సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి కిరణ్ చెప్పారు.బాపులపాడు మండలం వీరవల్లి ఎన్టీఆర్ బొమ్మ సెంటరులో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. పోలవరం పోరుకేక మహాయాత్ర గత 13 రోజులుగా జరుగుతోందన్నారు. నిర్వాశితులు తమ బృందానికి అనేక సమస్యలు తెలియజేశారన్నారు. అయినా బాధితుల గోడు పాలకులకు వినిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించమని కోరుతుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పెడచెవిన పెట్టడం సరి కాదన్నారు. ప్రాజెక్టు పూర్తి కావాలంటే ముందుగా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసి తర్వాత ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. గిరిజనులే కదా..ఏమి చేయలేరని అనుకుంటే పొరపడినట్లే అవుతుందన్నారు. వారి ఉగ్ర రూపాన్ని చూస్తే పాలకులు తట్టుకోలేరన్నారు.

ఐదేళ్లపోరాటంతో పేదలకు ఇళ్లు సాధించాం

పరిహారం అందించాకే ప్రాజెక్టును పూర్తిచేయాలి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కష్ణయ్య

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే ఏపీ అంతటికి నీళ్లు అందుబాటులోకి వస్తాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కష్ణయ్య చెప్పారు. అయితే నిర్వాసితుల సమస్య పరిష్కరించిన తర్వాతే ప్రాజెక్టులు నిర్మాణం పూర్తి చేయాలని చట్టాలు చెబుతున్నా పాలకులు పెడచెవిన పెడుతున్నారన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద త్రీ గోర్జస్ ప్రాజెక్టు నిర్మాణానికి ముందే చైనా ప్రభుత్వం 10 లక్షల మందికి పునరావాస నగరాలను నిర్మించి ఇచ్చిందన్నారు. ఇంటికి ఒక ఉద్యోగం ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో దీనికి భిన్నంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి భూములు, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయడానికి ప్రభుత్వాలు ముందుకు రావడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కారణంగా లాభపడుతున్న మైదాన ప్రాంత ప్రజలు, నష్టపోతున్న నిర్వాసితుల పోరాటాలకు అండగా నిలవాలన్నారు.

ఐదేళ్లపోరాటంతో పేదలకు ఇళ్లు సాధించాం

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

కోడూరుపాడు పంచాయతీలోని ఉమామహేశ్వరపురంలో యాత్రకు వ్యవసాయ కార్మికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ ఉమామహేశ్వరపురంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకున్న వారికి అండగా పార్టీ ఆధ్వర్యంలో ఐదేళ్లపాటు నిర్వహించిన పోరాటం విజయం సాధించిందన్నారు. ఇళ్ళు నిర్మించుకున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్లను అధికారులు అందించారన్నారు.

ఉపాధి కోసం ఐక్యంగా ఉద్యమించాలి

కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - తణుకు రూరల్



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

గీత కార్మికుల ఉపాధి కోసం ఐక్యంగా ఉద్యమించాలని కల్లుగీత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అన్నారు. ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ, సొసైటీ అధ్యక్షుల విస్తృత సమావేశం తణుకు అమరవీరుల భవనంలో జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ నేటికీ వృత్తినే నమ్ముకుని లక్షలాది మంది జీవిస్తున్నారన్నారు. వారి బతుకులకు భరోసా కల్పించి వృత్తిలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులను గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు పాదయాత్రలో సిఎం జగన్ చేసిన వాగ్దానాలు, ఇచ్చిన హామీలు గుర్తు లేవా అని ప్రశ్నించారు. ఒక్కటిగా ఉన్న గీతకార్మికులను కులాల పేర్లతో చీల్చి వారిమధ్య చిచ్చుపెట్టారని విమర్శించారు. 1991లో పోరాడి సాధించుకున్న గీతకార్పొరేషన్‌ను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కులాల పేర్లతో కార్పొరేషన్లు పెట్టి గీత కార్మికుల మధ్య చిచ్చు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మద్యపాన నిషేధం విధిస్తామని హామీ ఇచ్చి నేడు ప్రభుత్వమే చీప్ లిక్కర్ వరదలా పారిస్తూ గీత కార్మికుల జీవనోపాధిని దెబ్బ తీసిందని విమర్శించారు. హర్యానా, గోవా తదితర రాష్ట్రాల నుండి మద్యం అక్రమంగా వరదలా ఆంధ్రాకు ఎలా పారుతుందని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో బతకలేక వృత్తిని వదులుకుని గీత కార్మికులు భాగ్యనగరాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నాలుగేళ్ల కాలంలో గీత కార్మికులకు వైసిపి ప్రభుత్వం ఏమి చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేరళ, తెలంగాణ ప్రభుత్వాలు గీత కార్మికులకు భరోసా ఇస్తు అన్నివిధాలా ఆదుకుంటూ, కొండంత ధైర్యాన్నిస్తూ గీత కార్మికుల కుటుంబాల్లో ఆనందాన్ని కలుగజేస్తుంటే మనరాష్ట్రంలో గీత కార్మికులు కన్నీళ్ల పెట్టే పరిస్థితి వైసిపి ప్రభుత్వం కల్పించటం సిగ్గు చేటన్నారు. గీత కార్మికుల జీవితాల్లో మార్పు రావాలంటే వృత్తిఆధునికీకరణ, నీరా, తాటి ఉత్పత్తులు పరిశ్రమల ఏర్పాటు, గీత కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత, వృత్తి సంక్షేమం, వృత్తిలో ఉపాధి అవకాశాల కోసం పోరాటాలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం కిస్తీలు రద్దు చేసి చెట్లపై హక్కు లేకుండా చేసి వృత్తిని దెబ్బతీసిందన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తాటి చెట్లను నరికి వేస్తున్నా చర్యలు తీసుకోవాల్సిన చట్టం ఉన్నా వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. వృత్తి చేస్తూ ఇటీవల కాలంలో చాలా మంది ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయినవారు, గాయపడినవారు ఉన్నారని, వారికి పరిహారం అందడం లేదన్నారు.

ప్రభుత్వం ఆర్భాటంగా మృతులకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని ప్రకటించిందని, కానీ ఈ రోజు వరకూ విధి విధానాలు ఎందుకు ప్రకటించ లేదని ప్రశ్నించారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడాల్సిం దేనన్నారు. ఈ సమావేశంలో కడలి పాండు, బొక్కా చంటి, గుబ్బల వీర రాఘవులు, కాగిత రాధాకృష్ణ, మామిడిశెట్టి నాగ భూషణం, కోమిటి శ్రీనివాస్, గుబ్బల నరసింహస్వామి, బొక్కా సోమేశ్వరరావు, చింతపల్లి వీరాస్వామి, కోమిటి సత్యనారాయణ, దాసరి సూరిబాబు పాల్గొన్నారు.

పోలవరం పోరుకేక యాత్రకు ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మద్దతు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ముంపునకు గురవుతున్న గ్రామంలోని అడవి బిడ్డల ఆక్రందనలు ఆలకించి వారి కుటుంబాలను ఆదుకునేలా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేసి నష్టపరిహారం ఇవ్వటమే కాక నూతన గ్రామాలు నిర్మించాలని, నిర్వాసితుల భూమికి భూమి ఇవ్వాలని కోరుతూ జూన్ 20 నుంచి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వంలో జరుగుతున్న పోలవరం పోరుకేక పాదయాత్రకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నానని గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణంలో భాగంగా ఎనిమిది మండలాలు ముంపు మండలాలుగా గుర్తించబడి, దాదాపు లక్షకు పైగా కుటుంబాలు నివసించే సుమారు 300 గ్రామాలు పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో మునిగిపోతాయని, పోలవరం ప్రాజెక్ట్ 41.15 మీటర్ ఎత్తు కాంటూరు కింద కొన్ని గ్రామాలు, 45.7 కాంటూరు కింద మరికొన్ని గ్రామాలుగా విభజించారని చెప్పారు. గతేడాది వచ్చిన వరదల్లో పోలవరం స్పిల్ వే వద్ద 36 మీటర్ల ఎత్తున వచ్చిన వరద ప్రవాహానికే 45.7 కాంటూరు పరిధిలో చేర్చిన చాలా గ్రామాలు నీట మునిగాయన్నారు. ఈ లెక్కలన్ని కాకి లెక్కలని గోదావరి వరద ప్రవాహంతో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. తాను స్వయంగా వరద సమయంలో నీట మునిగిన 45 కాంటూరు పరిధిలో చేర్చిన గ్రామాలను సందర్శించి గిరిజనుల ఇబ్బందులు గమనించానని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల జీవితాలతో ఆటలాడటం మానేసి పరిహారం పూర్తిగా చెల్లించిన తరువాతే ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఆలోచింపజేసిన నాటికలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ), హేలాపురి కళాపరిషత్ ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో అల్లూరి సీతారామరాజు స్మారక ఆహ్వాన నాటిక పోటీలు రెండో రోజు ఆదివారం ప్రదర్శించిన మూడు నాటికలు అలరించాయి. వల్లూరి శివప్రసాద్ రచించిన గంగోత్రి సాయి దర్శకత్వం వహించిన వెండి అంచులు నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. స్వసుఖం కోసం మాత్రమే స్త్రీనివాడుకునే కాముకుని మీద తిరుగుబాటు చేయలేని నిస్సహాయ స్థితిలో స్త్రీ ఎంత కాలం అణగారి ఉంటుందనే సామాజిక అంశంపై ఈ నాటికలో పాత్రలు పోషించిన నటీనటుల నటన పోటా పోటీగా సాగి వీక్షకులను వీనుల విందు పరిచింది. 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' 'కాపలా' అనే నాటికలు ప్రేక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో వైఎంహెచ్ఎ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, వైఎంహెచ్ఎ కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, హేలాపురి కళాపరిషత్ అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, గుత్తా కౌసలేంద్రరావు, సంకు సురేష్, ఎండి.ఖాజావలి, వైఎంహెచ్ఎ సభ్యులు డాక్టర్ లంక వెంటేశ్వర్లు, కళాభిమానులు, పురజనులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నాటికలో సన్నివేశం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

అభివృద్ధి పథంలో కలిదిండి పంచాయతీ

ప్రజాశక్తి - కలిదిండి

కలిదిండి పంచాయతీ అభివృద్ధి పథంలో నిలిచేలా సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్న కృషి చేస్తున్నారని కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కలిదిండి పంచాయతీలో సుమారు రూ.1.50 కోట్ల ప్రభుత్వ నిధుల కేటాయింపుతో పనులు జరుగుతున్నాయన్నారు. సచివాలయం-2 పరిధిలో రూ.70 లక్షలతో నిర్మించిన రెండు సీసీ డ్రెయిన్‌లను, మైక్రో ఫిల్టర్‌ను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వ గ్రాంట్ రూ.20 లక్షలు, ఇతర గ్రాంట్లు రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. సచివాలయం-1 పరిధిలో ప్రభుత్వ గ్రాంట్ రూ.20 లక్షలు, పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రతి అభివృద్ధి కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తున్న సర్పంచి మసిముక్కు మారుతీ ప్రసన్నను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు బొర్రా సత్యవతి, క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచులు మసిముక్కు మారుతీ ప్రసన్న వెంకటేశ్వరరావు, సానా మీనా సరస్వతి, నరహరిశెట్టి నరసయ్య, ద్రోణాద్రి నాగలక్ష్మి, అనపర్తి వడ్డికాసులు, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, ఎంపిటిసి గోదావరి సత్యనారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు గద్దె ఆనంద్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముసునూరు

జగనన్న సురక్ష పథకాలపై ప్రతిఒక్క అధికారి అవగాహన కలిగి ఉండి గ్రామస్తులకు పథకాలపై సూచనలు ఇవ్వాలని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. మండలంలోని లోపూడి, సూరేపల్లి గ్రామ పంచాయతీల్లో మండల శాఖ అధికారులతో కలిసి సురక్ష పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్పంచి పేరం కృష్ణ, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కూచిపూడి సాయిరాం, జూనియర్ అసిస్టెంట్ సన్నీ రాజన్ పాల్గొన్నారు.

వేల్పుచర్లలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ముసునూరు

వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావటమే రాష్ట్ర ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం అని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నూతన పరిశ్రమలు రాకపోవడమే కాకుండా, ఉన్న పరిశ్రమలు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. రైల్వే జోను, విశాఖ ఉక్కు వంటి అభివృద్ధి మరిచి, అతను కేసులు, అతని కుటుంబ సభ్యుల కేసుల మాఫీ చేసుకోవడానికి ఢిల్లీ వెళ్లి నరేంద్ర మోడీ కాళ్లు పట్టుకునే పరిస్థితి జగన్ పరిస్థితి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు, టిడిపి మండల అధ్యక్షులు దేవినేని ధలారాం, విజయ్ కుమార్, వాసు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా విద్యాసాగర్ పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక వైసిపి సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్ 48వ పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నేతల సమక్షంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా పార్లమెంట్ సభ్యులు కోటగిరి శ్రీధర్ బాబు మేడవరపు విద్యాసాగర్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక వైసిపి నాయకులు, పట్టణ ప్రముఖులు అధిక సంఖ్యలో విద్యాసాగర్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జెడ్‌పిటిసి సభ్యులు పోలినాటి బాబ్జి, మేడవరపు విద్యాసాగర్, వైసిపి మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి సోంబాబు, ఉభయగోదావరి జిల్లా బూత్ కమిటీ రీజనల్ కో-ఆర్డినేటర్ బివిఆర్.చౌదరి, పిపిఎన్.చంద్రరావు, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, అయినాల వెంకటరమణమూర్తి, బత్తిన చిన్న, చిటికెల అచ్యుతరామయ్య, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్ పాల్గొన్నారు.

రక్షణ సైన్యం ఆవిర్భావ వేడుకలు

ముసునూరు :మండలంలోని ముసునూరులో రక్షణ సైన్యం సంఘం కాపరులు కెప్టెన్ ఎం.రాజు వనిత దంపతుల ఆధ్వర్యంలో రక్షణ సైన్యం స్థాపించిన రోజు సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం చర్చి వద్ద రక్షణ సైన్యం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా సంఘ కాపరులు రాజు మాట్లాడుతూ 1865లో జులై రెండో తేదీన లండన్‌లో జనరల్ విలియం బూత్, కేథరిన్ దంపతులు స్థాపించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సంస్థ 126 దేశాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ముసునూరు, వేల్పుచర్ల, గోపవరం, పెదపాటివారిగూడెం, కాట్రేనిపాడు గ్రామాల్లో సాల్వేషన్ ఆర్మీ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సంఘపెద్దలు, సంఘ కాపరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పుల్లేరులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి పోల్‌రాజ్ కెనాల్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కృష్ణాజిల్లా పామర్రు మండలం పసుమర్రు పంచాయతీ శివారు గంగుల చెర్వు గ్రామానికి చెందిన గంటూరు గంగాధరరావు (29) అనే రైతు శనివారం సాయంత్రం నారుమడిలో ఎరువు చల్లేందుకు పడవలో ఎరువు కట్ట వేసుకుని ఇంటి ముందు ఉన్న పుల్లేరు దాటుతుండగా ప్రమాదవశాత్తు పడవలో నుంచి జారి పుల్లేరులో పడిపోయాడు. గంగాధరరావుకు ఈత రాకపోవడంతో పుల్లేరులో మునిగిపోయాడు. పుల్లేరులో పడిపోవడం గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎంత గాలించినా గంగాధరరావు అచూకీ లభ్యం కాలేదు. ఆదివారం మండలంలోని గురజ గ్రామం వద్ద పోల్‌రాజ్ కెనాల్‌లో గంగాధరరావు మృతదేహం లభ్యమైంది. దీంతో సమాచారం అందుకున్న పామర్రు పోలీసులు గురజ వచ్చి కాల్వలో నుంచి మృతదేహన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి మృతదేహన్ని తరలించారు. పోస్టుమార్టం ఆనంతరం మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతునికి భార్య, ఏడు నెలల కుమార్తె ఉన్నారు. పామర్రు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం అక్రమ విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని సుంకొల్లు గ్రామంలో 105 తెలంగాణ మద్యం సీసాలను నూజివీడు రూరల్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయమైన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తన సిబ్బందితో గ్రామంలోని ఒక మహిళ వద్ద తనిఖీలు నిర్వహించగా తెలంగాణకు చెందిన 105 మద్యం సీసాలు లభ్యమయ్యాయి. వీటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించింది.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

భీమడోలు : సూరప్పగూడెం గ్రామ శివారులోని పొలాల్లో కొనసాగుతున్న పేకాట శిబిరంపై భీమడోలు ఎఎస్ఐ చలపతిరావు తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.4580 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పల్లె ప్రజలకు పసర్ల నీరే దిక్కు..!

చెరువుల్లో తగ్గిన నీటిమట్టాలు
పనిచేయని ఫిల్టర్ బెడ్స్
శుద్ధి చేయని నీటితో జనం అవస్థలు



పసర్లుగా మారిన మంచినీటి చెరువులోని నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువుల్లో నీటిమట్టాలు బాగా తగ్గాయి. ఎండల తీవ్రతకు నీటిమట్టాలు తగ్గి మంచినీటి చెరువుల్లో నీరు పసర్లగా మారిపోతోంది. కుళాయిల ద్వారా ఆ పసర్ల నీటినే పంచాయతీలు ప్రజలకు సరఫరా చేస్తున్నారు. చెరువుల్లో నీరు చిక్కపడి వివిధ రంగుల్లో మారడంతో ఈ నీరు ఫిల్టర్ కావడంతో లేదు. అనేక గ్రామాల్లో ఫిల్టర్ బెడ్స్ పని చేయడంలేదు. దీంతో చెరువుల్లో నీటిని ట్యాంకులోకి ఎక్కించి సరాసరి ఆ నీటినే కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. దీంతో చేసేదిలేక ప్రజలు ఆ నీటినే తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆర్థిక స్తోమత ఉన్న వారు ప్రయివేట్ ఆర్ఒ ప్లాంటుకు వెళ్లి నీటిని కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. అనేక గ్రామాల్లో ప్రజలు మాత్రం స్వచ్ఛమైన నీటి కోసం ఇక్కట్లు పడుతున్నారు. కాల్వలకు నీరు వచ్చి, ఆ నీటిని చెరువుల్లో నింపేవరకు అధికారులు మంచినీటి ట్యాంకర్ల ద్వారా పల్లె ప్రజలకు నీటిని సరఫరా చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే మండలవ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఒక్కపూట మాత్రమే కుళాయిల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. పంచాయతీలు పసర్లు కట్టిన నీటిని కుళాయిల ద్వారా సరఫరా చేయడంతో ఆ నీటిని తాగలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే 70 శాతం పైగా చెరువుల్లో నీటి నిల్వలు తగ్గినట్లు అంచనా వేస్తున్నారు. దీంతో దప్పిక తీర్చుకునేందుకు అత్యధిక శాతం మంది గ్రామాల్లోని మినరల్ వాటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. దీంతో నీటి కోసం చాలా డబ్బు ఖర్చు పెడుతున్నట్లు ప్రజలు చెబుతున్నారు.



నీరు తీసుకెళ్తున్న వ్యక్తి

మండల వ్యాప్తంగా 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో సూమారు 80 వేల జనాభా ఉన్నారు. 34 రక్షిత మంచినీటి పథకాలు ఉండగా, వీటికి అనుబంధంగా 41 మంచినీటి చెరువులు ఉన్నాయి. అయినా నీటి కోసం ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో ఐదారు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లి నీటిని గ్రామస్తులు సైకిళ్లు, బైక్‌లపై తెచ్చుకుంటున్నారు. పంట కాల్వలకు నీరు వదిలిన పది రోజుల వరకు చెరువుల్లోకి ఆ నీటిని నింపే అవకాశం ఉండదు. కాల్వలకు పూర్తిస్థాయిలో నీరు వచ్చి మంచినీటి చెరువుల్లో ఆ నీరు నింపే వరకు తమకు నీటి కష్టాలు తీరేలా లేవంటూ మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని డిఎఆర్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న ఎనిమిడో అంతర్రాష్ట్ర బాస్కెట్ బాల్ బాలుర, బాలికల ఛాంపియన్‌షిప్ పోటీలు ఫైనల్ దశకు చేరుకున్నాయి. బాలుర విభాగంలో కృష్ణ, తూర్పుగోదావరి జట్లు, బాలికల విభాగంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జట్లు ఫైనల్‌లో తలపడనున్నాయి. బాలుర విభాగంలో రెండు సెమీఫైనల్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి.

అధికారుల తీరుపై ఎంఎల్ఎ ఆగ్రహం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరం గ్రామంలో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్ఆర్ జలకళ పథకం కింద అన్నవరంలో ఒక్క లబ్ధిదారు కూడా లేకపోవడం ఏంటని అధికారులను ఎంఎల్ఎ ప్రశ్నించారు. ఈ పథకం గురించి ప్రజలకు అధికారులు అవగాహన కల్పించకపోవడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కౌలుకు ఆలయ భూములు వేలం

ప్రజాశక్తి - ముసునూరు

ఎట్టకేలకు బలివే ఆలయ భూములకు ఆలయ అధికారులు కౌలు వేలంపాట నిర్వహించారు. మండలంలోని బలివే గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆలయ ఇఒ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ఆర్ఎస్ నెంబర్ 118లో య.8.78సెంట్ల భూమికి ఒక సంవత్సరం పాటు వ్యవసాయ పంటలు సాగు చేసుకునేందుకు గాను కౌలు వేలంపాట నిర్వహించారు. రూ.1.10 లక్షలు పిల్లి గంగాధరరావు హెచ్చు పాట పాడుకోగా, గత సంవత్సరంతో పోలిస్తే ఆదనంగా రూ.పది వేలు అధిక కౌలు వచ్చినట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు సిఐటియు వినతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

వైసిపి అధికారంలోకొచ్చిన నాలుగేళ్లలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఏ పథకమూ అమలు చేయలేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు విమర్శించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు నాయకులు ఆదివారం వినతిపత్రం అందించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పాటు చేసిన బిల్డింగ్ నిర్మాణాల దగ్గర వంద శాతం వసూలు చేసి సెస్సును నిర్మాణ కార్మికులు కుటుంబాలకు మాత్రమే ఖర్చు చేయాలని, ప్రభుత్వాలు ఇతర అవసరాలకు వాడకూడదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా కార్మికుల కోసం వసూలు చేసిన సంక్షేమ బోర్డులో రూ.1150 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేసి రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి పెండింగ్‌లో ఉన్న క్లైములు పాతవి శాంక్షన్ చేసిన వాటికి నిధులను విడుదల చేయాలని కోరారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులందరికీ వృద్ధాప్య వికలాంగుల పెన్షన్ అమలు చేయాలని, ప్రభుత్వం దారి మళ్లించిన సంక్షేమ బోర్డు నిధులు సంక్షేమ బోర్డుకు జమ చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మారిన పేర్రాజు, వేగివాడ నాగేశ్వరరావు, బుర్రి నరేంద్ర, సేలం నాగేంద్రస్వామి, బుర్రి సత్తిబాబు, మందపాటి పండు, ఆపోజి నాగు, దాసరి పండు, జక్కు సూర్యచంద్రం, పేరు సత్యనారాయణ, బొంగు అన్నవరం, కల్యాణి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టాలి

ప్రజాశక్తి - మండవల్లి

ప్లాస్టిక్ వినియోగంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి అరికట్టేలా చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ ఐక్య వేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. ఈ నెల మూడో తేదీ అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన నివాసంలో మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ ఎక్కడా అమలు కావడం లేదన్నారు. దీంతో బహిరంగ మార్కెట్లో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, ఇతర నిషేధ ఉత్పత్తులు, విక్రయాలు భారీగా సాగుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై ఉన్న దుష్ఫలితాలపై వ్యాపారులకు గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో విఫలమయ్యారని విమర్శించారు. కనీసం తూతు మంత్రంగా కూడా నిర్వహించడం లేదన్నారు. అధికారులు కనీసం పంచాయతీ పరిధిలో కూడా తనిఖీలు ఏమాత్రం చేయకపోవడంతో నిషేధం అమలు కావట్లేదని తెలిపారు. దీంతో బడ్డీ కొట్టు మొదలుకొని పెద్ద పెద్ద షాపుల్లో నిషేధత క్యారీ బ్యాగులు, ఇతర ప్లాస్టిక్ వస్తువుల వినియోగం పెద్దఎత్తున సాగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై దృష్టి సారించి నిషేధించి పర్యావరణాన్ని రక్షించి మానవాళి మనుగడ సజావుగా సాగేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

కోతుల బెడద.. ప్రజలు బెంబేలు

గ్రామాల్లో యథేచ్ఛగా సంచారం
ప్రజలపై దాడి, గాయాలబారిన జనం



కోతుల గుంపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కోతుల ఆగడాలతో మండల ప్రజలు హడలెత్తిపోతున్నారు. కోతుల చేష్టలతో మండల ప్రజానీకం భయందోళనలు చెందుతున్నారు. వనాల్లో ఉండాల్సిన కోతులు జనారణ్యంల్లోకి వచ్చి ప్రజలను ముప్పుతిప్పలు పెడుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి. వీటి బెడదతో మండల ప్రజలు తమప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్న పరిస్థితులు మండలంలో నెలకొన్నాయి. మండలంలో దాదాపు అన్నీ గ్రామాల్లో కోతుల బెడద అధికంగా ఉంది. కోతులు ఇళ్లల్లో చొరబడి దొరికినవి ఎత్తుకుపోవడం, చేతుల్లో ఉన్నవి లాక్కుని పరుగులు తీస్తున్నాయి. మండలంలోని బొమ్మినంపాడు, వాడవల్లి, ఉటుకూరు, వైవాక, దేవరం, కాకరవాడ, వడాలి, పెయ్యేరు, కోడూరు, పెనుమల్లి, చేవూరు, శ్రీహరిపురం, ముదినేపల్లి, అన్నవరం, చినపాలపర్రు, విశ్వనాద్రిపాలెం, పెదగొన్నూరు తదితర గ్రామాల్లోని ప్రజలకు కంటిమీద కునుకు ఉండడంలేదు. గ్రామాల్లో ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కోతులు దర్శనమిస్తున్నాయి. ఎవరైనా కోతులను అదిలిస్తుంటే వారిపై ఎదురుదాడికి దిగుతున్నాయి. దీంతో పిల్లలను బయటకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీటి చేష్టలతో ప్రజలు భయంభయంగా రోడ్లపై రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఉదయం ఇంటింటా పేపర్, పాలప్యాకెట్లు వేసే కుర్రోళ్లు కోతుల ఆగడాలకు భయపడుతున్నారు. వీటి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని, కోతులను పట్టించి వనాల్లో వదిలివేయాలంటూ ఆయా గ్రామాల ప్రజలు పలుసార్లు గ్రామ పంచాయతీలకు, స్పందనల్లో ఫిర్యాదులు చేశారు. అయినా పంచాయతీలు పట్టించుకోవడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ధ్వంసం చేస్తూ..

కోతులు ఇంటిపై కప్పులు, టివి డిష్‌లు ధ్వంసం చేస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి తినుబండారాలు, కూరగాయాలు, నిత్యావసర సరకులను ఎత్తుకుపోతున్నాయి. ట్యాంకుల్లో దిగి ఈత కొడుతూ నీటిని కలుషితం చేస్తున్నాయి. మామిటి, కొబ్బరి, జమా, సపోటా చెట్లపై చేరి కాయలను ధ్వంసం చేస్తూ నష్టం కలుగుచేస్తున్నాయి. చేపల చెరువుల గట్లపై నిల్వ ఉన్న మేతలను తింటూ, ధ్వంసం చేస్తూ రైతులకు తీవ్ర నష్టం కలుగచేస్తున్నాయి.

జనాలపై దాడి

కోతులు జనాలపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి. ఇటీవల మండలంలోని చేవూరుకు చెందిన పోలవరపు చంటి అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరిచాయి. నిత్యం ఏదో గ్రామంలో ప్రజలు వీటి బారిన పడి గాయాలపాలవుతున్నారు. వీటి బారినపడి గాయపడ్డ జనం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ చికిత్స పొందుతున్నారు.

తలుపులు వేసుకొని పనులు చేసుకుంటూ

కోతుల ఆగడాలకు మహిళలు భయపడి పోతున్నారు. ఇళ్లల్లోకి కోతులు చొరబడిపోవడంతో చేసేది లేక ఇంటి తలుపులు వేసుకుని మహిళలు ఇంటిలో పనులు చేసుకుంటున్నారు. తలుపులు తీసిఉంటే కోతులు లోనికి వెళ్లి మహిళలపై దాడి చేస్తూ తినుబండారాలు ఎత్తుకుపోతున్నాయి. దీంతో మహిళలు బిక్కుబిక్కుమంటూ భయపడుతూ జీవనం సాగిస్తున్నారు.

కూలీలకు కోతుల బెడద

పొలం పనులకు వెళ్లే మహిళ కూలీలు కోతుల బెడదతో ఇక్కట్లు పడుతున్నారు. కాల్వగట్లపై కోతులు గుంపులు గుంపులు వెళ్తూ వ్యవసాయ పనులకు వెళ్లే మహిళ కూలీలను భయపెడుతున్నాయి. పొలం పనులకు వెళ్లే మహిళ కూలీలు, బట్టలు ఉతికేందుకు కాల్వలకు వెళ్లే మహిళల వెంట కోతులు పడడంతో మహిళలు ఆందోళనలు చెందుతున్నారు.

కోతుల బెడదతో కొందరు గ్రామస్తులు తమ ఇళ్ల వద్ద పులులు, కొండముచ్చులు బొమ్మలు పెట్టుకుంటూ కోతులు రాకుండా చూసుకుంటున్నారు. ఆ బొమ్మలను చూసిన కోతులు అవి నిజమైనవి అనుకుని అటువైపు వెళ్లడం లేదు. కోతుల బెడదతో ప్రజలు ఫిర్యాదులు ఎక్కువ రావడంతో కొన్ని పంచాయతీలు తాత్కాలిక నివారణ చర్యలు చేపట్టాయి. కొండముచ్చులను అద్దెకు తీసుకువచ్చి గ్రామంలో కోతులు సంచారం ఎక్కువ ఉన్న చోట్ల రెండు రోజుల పాటు బైక్‌పై తిప్పడంతో కోతులు తాత్కాలికంగా రెండురోజుల పాటు గ్రామాల్లో కనబడడంలేదు. అయినా తిరిగి మళ్లీ మూడో రోజు యధావిధిగా కోతులు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి కోతుల నివారణ చర్యలు చేపట్టి ప్రజలు ప్రాణాలను కాపాడాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం
ఎంపిడిఒ పి.మల్లీశ్వరి

మండలంలో కోతుల బెడద ఉన్న మాట వాస్తవమే. కోతులతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. శాశ్వత పరిష్కారం కోసం చూస్తున్నాం. త్వరలో అటవి శాఖ అధికారులతో మాట్లాడి కోతులను పట్టించి శాశ్వత నివారణ చర్యలు తీసుకుంటాం.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక శ్రీనివాసపురం రోడ్డు బైపాస్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారి రోడ్ మార్జిన్ ఆక్రమణలు తొలగించారు. ఇటీవల శ్రీనివాసపురం రోడ్డు రాష్ట్ర రహదారి రోడ్డు మార్గం ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన నేషనల్ హైవే డిఇ శ్రీనివాసరావు రోడ్డు మార్జిన్ ఆక్రమణ చేసిన దాక్షాయని పెట్రోల్ బంకు నిర్వాహకులపై పోలీస్ ఫిర్యాదు చేశారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులను ఆక్రమణ తొలగించాలని హెచ్చరించారు. ఈ క్రమంలో రాష్ట్ర రహదారి రోడ్డు మార్జిన్ ఆక్రమణలను పెట్రోల్ బంక్ నిర్వాహకులు స్వచ్ఛందంగా తొలగించినట్లు సమాచారం.



ఆక్రమణలు తొలగించిన ప్రాంతం

ఉంగుటూరు ఎంఇఒగా రవీంద్రభారతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎంఇఒ-1గా నిమ్మగడ్డ రవీంద్ర భారతి నియమితులయ్యారు. ఆమె ఏలూరు బాలికల ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తూ ఆదివారం జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో ఉంగుటూరు ఎంఇఒ-1గా నియమితులయ్యారు. భారతి గతంలో తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖాధికారిణిగా పనిచేశారు. ఇప్పటివరకు పనిచేసిన లక్ష్మీనారాయణ తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురుకు బదిలీ అయ్యారు.



రవీంద్రభారతి

7న నూజివీడులో మామిడి రైతుల సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రపంచ మామిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఏడో తేదీన నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులోని ఛత్రపతి సదన్‌లో భారతీయ కిసాన్ సంఘ్, నూజివీడు ఆర్గానిక్ ఫార్మర్స్ అసోసియేషన్ (నోఫా) ఆధ్వర్యంలో మామిడి రైతుల సదస్సు నిర్వహించుచున్నట్లు నోఫా కార్యదర్శి బోగోలు రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా మామిడి రైతులు అందరూ హాజరుకావాలని ఆయన తెలిపారు.

రోటరీ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టారు. స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాలులో అధ్యక్షునిగా రొంగల దేవీప్రసాద్, కార్యదర్శిగా బవిరిశెట్టి హనుమాన్ తిలక్‌లతో కూడిన నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటి వరకు రోటరీ అధ్యక్షులుగా ఉత్తమ సేవలందించిన దాకారపు కృష్ణ చేతుల మీదుగా, గౌరవ అతిథిగా పాల్గొన్న అసిస్టెంట్ గవర్నర్ సుబ్రహ్మణ్య, రోటరీ చార్టర్ సభ్యులు మల్లాది సీతారామారావు (ఎంఎస్ఆర్), చామర్తి శ్రీరాములు సమక్షంలో నూతన కార్యవర్గం భాద్యతలు స్వీకరించారు. రోటరీ 22-23 కార్యదర్శి వూడా రాంగోపాల్(గోపీ) నిర్వహణలో అధ్యక్షులు దాకారపు కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో చార్టర్ సభ్యులు జ్యోతిప్రజ్వలన చేయగా పాల్ హరీష్ విగ్రహానికి దాకారపు కృష్ణ, చోడిపింది సుబ్రహ్మణ్యం పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. నూతన అధ్యక్షుడిగా భాద్యతలు స్వీకరించిన రొంగల దేవీప్రసాద్ మాట్లాడుతూ రోటరీ జంగారెడ్డిగూడెం నాలుగు దశాబ్దాల ప్రస్థానం స్పూర్తితో సభ్యులు, దాతలు, స్నేహితులు, శ్రేయోభిలాషుల ఆశీస్సులతో తమ శక్తివంచన లేకుండా జిల్లా గవర్నర్ దత్తా సుబ్బారావు మార్గ నిర్దేశకత్వంలో స్థానిక అవసరాలపై దృష్టిపెట్టి సక్రమంగా తమ భాద్యతలు నిర్వహిస్తామని తెలిపారు. రోటరీ నూతన కార్యవర్గం మొదటి సేవా కార్యక్రమంగా యడ్లపల్లి కావ్య అనే విద్యార్థిని విద్యా అవసరాలకు రూ.ఐదు వేలు దాకారపు కృష్ణ వితరణతో రొంగల దేవీప్రసాద్ చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ పూర్వ అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాస్, పట్టణ ప్రముఖులు మేడవరపు సాగర్, చిటికెల అచ్యుత రామయ్య, రాజన సత్యనారాయణ, చిటికెన రాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వారాహి యాత్ర విజయవంతం : జనసేన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఉభయగోదావరి జిల్లాలో చేపట్టిన వారాహి యాత్ర జనసేన పార్టీలో రెట్టింపు ఉత్సాహాన్ని కలిగించిందని ఆ పార్టీ గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలోని పివిఆర్ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన జనసేన పార్టీ మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రానున్న రోజుల్లో రెండో విడత వారాహి యాత్ర ఏలూరు నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. అతి త్వరలో ద్వారకాతిరుమల మండలంలో జనసేన పార్టీకి అన్ని కమిటీలు పూర్తి చేస్తామన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంట్రపాటి రాజు మాట్లాడుతూ వారాహి యాత్ర ద్వారా అధికార పార్టీ నాయకుల్లో గుబులు పట్టుకుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దాకారపు నరసింహమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వీర మహిళలు చింతల కుమారి, సౌజన్యతో పాటు నల్లజర్ల నాయకులు కాంతారావు, అనంతపల్లి నాయకులు రమేష్, దేవరపల్లి నాయకులు సతీష్, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.